క్లుప్తంగా

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : పులివెందుల ఆర్టీసీ డిపో సంస్థ అందిస్తున్న సేవలను ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందుల డిపో నుంచి సింహాద్రిపురం–బెంగళూరు సర్వీసులు రాత్రి 9 గంటలకు నడపాలని స్థానిక ప్రజల అభిప్రాయం మేరకు ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ చైర్మన్ మల్లికార్జునరెడ్డి ఆదేశాల మేరకు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే పులివెందుల నుంచి నల్లచెరువుపల్లె, రామిరెడ్డిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా ప్రొద్దుటూరుకు అదనంగా బస్సు సర్వీసు నడుపుతున్నామన్నారు. రామిరెడ్డిపల్లె, మెయిన్ చెరువు గ్రామాల ప్రజల మేరకు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సు సర్వీసులను ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని న్యాక్ బిల్డింగ్ హాస్టల్, ఎస్సీ కాలనీ డీటీఆర్‌కు 11కె.వి. విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. అలాగే విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెన్స్, 11కె.వి. విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా పులివెందుల పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటలవరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత



పులివెందుల టౌన్ : పట్టణంలోని అమ్మవారిశాలలోని శ్రీకన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అధిక శ్రావణ మాస మూడవ శుక్రవారం సందర్భంగా వాసవీమాతను ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని భక్తులకు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శాకంబరీ అలంకారంలో పార్వతి అమ్మవారు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధిలో వెలసిన శ్రీపార్వతి సమేత పాతాళ సోమేశ్వరస్వామి ఆలయంలో అధిక శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారిరు శాకంబరీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మధుసూధన శర్మ, సాయి నిఖిల్ శర్మల ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ అలంకారంలో అలంకరించారు. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

మణిపూర్ అరాచకాలకు నిరసనగా ర్యాలీ



పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పులివెందుల టౌన్ : మణిపూర్ అరాచకాలకు వ్యతిరేకంగా పట్టణంలో ముస్లింలు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో జరిగిన హింసకు కారకులైన వారిని వెంటనే శిక్షించాలని వారు కడప రోడ్డులోని మసీదు నుంచి పూలంగళ్ల మీదుగా పాత బస్టాండు, పాత గంగిరెడ్డి ఆసుపత్రి, తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకుని అక్కడ డిప్యూటీ తహసీల్దార్ వీరశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పులివెందుల ముస్లిం కమ్యూనిటీ ముక్తి కలీముల్లా మౌలానా అబ్దుల్ కలాం, మౌలానా ముఖిద్, మౌలానా అబ్దుల్ రహీం, మైనార్టీ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, రసూల్, కౌన్సిలర్ ఖాదర్‌బాషా, ముస్లిం యువత జహీర్ మహమ్మద్, ఆసిఫ్, నూరు, సోయబ్ నజీర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వీఎన్‌పల్లెకు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం వీరపునాయునిపల్లె మండలంలో పర్యటించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో జరగబోవు మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.



చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు పెన్నెర లక్ష్మీదేవి. వద్దిరాల గ్రామం, మైలవరం మండలం. గత నాలుగేళ్ళుగా జగనన్న పాలన మాలాంటి పేదలకు ఎంతగానో ఉపయోగపడుతోందంటుంది. ఇంటివద్దకే రేషన్ పంపిణీ, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంటల బీమాలాంటివే కాకుండా జగనన్న ఇస్తున్న నగదు పథకాలు కుటుంబ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, 45 సంవత్సరాలు నిండిన పేద మహిళగా నాకు సంవతసరానికి రూ.18,750 బ్యాంకు ఖాతాలో జమ అవుతోందని చెబుతోంది. జగనన్న పుణ్యమా అని మాకు 1.5 సెంటు స్థలం, నివాసగృహం మంజూరయ్యాయని ప్రస్తుతం ఇలు నిర్మాణ దశలో ఉందంది. మొత్తం రూ.1,80,000 లకు గాను ఇప్పటికే లక్షా పదివేల రుపాయలు మా అకౌంట్‌లోకి చేరిందంటోంది. మహిళ స్వయం సహాయక గ్రూపులో నేను కూడా సభ్యురాలను, కాబట్టి ఏడాదికి రూ.10 వేలు అందుతోందని అలాగే మా అమ్మాయి ప్రసన్న డిగ్రీ చదువుతుండటంతో కళాశాల ఫీజులన్నీ విద్యాదీవెన పేరుతో ప్రభుత్వమే చెల్లిస్తోందని, ఇక వసతి దీవెన ఏడాదికి రూ.10 వేలు మా అకౌంట్‌లో జమ అవుతుందని ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది. ఒక్క రూపాయి కూడా లంచం ఆశించకుండా మా ఊరిలోని గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చురుగ్గా పనిచేస్తున్నారు. నిజంగా ఇలాంటి పాలన గతంలో ఎన్నడూ చూడలేదు.. ఇక చూడబోము అని అంటోంది.



ఈ చిత్రంలోని ఈయన పేరు కె.పెద్ద మౌలాలిరెడ్డి, చిన్నవెంతుర్ల గ్రామం, మైలవరం మండలం. మాకు అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ.13 వేలు, రైతు భరోసా పథకం కింద రూ.15 వేలు, పంట బీమా ద్వారా రూ.9,675, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.18 వేలు అందుతోందని ఆనందం వ్యక్తం చేశాడు. ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా మేము రూ. 90,175 నగదు అందుకున్నాం. వాస్తవానికి మా ఊరు జిల్లా సరిహద్దుల్లో ఉంది. మాకు బస్సు కూడా లేదు. మేం మండల కేంద్రానికి వెళ్లాలంటే 35 కిలోమీటర్లు వెళ్లాలి. జగనన్న ప్రభుత్వం వచ్చాక మా ఊరికి 3 కిలో మీటర్ల దూరంలోనే బెస్తవేములలో గ్రామ సచివాలయం నిర్మించారు. పదిమంది ఉద్యోగులు అక్కడ పనిచేస్తున్నారు. ఏ సమస్య వచ్చినా మండలానికి వెళ్లకుండానే సచివాలయంలోనే పనులు జరుగుతున్నాయి. మాలాంటి రైతు బిడ్డలకు ఇంతకంటే ఏం కావాలంటున్నాడు.

సచివాలయాలతో సత్వర సేవలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): మహాత్మగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి ఈ వ్యవస్థలో అవినీతికి తావులేకుండా చేశారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాలకు వెళ్లకుండా వారి గ్రామాల్లోనే సేవలు పొందేలా సచివాలయాల్లో 12 శాఖల సంబంధించిన అధికారులను నియమించారు. దీంతో సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. సచివాలయాలు సంక్షేమపథకాల నిలయంగా మారాయి. సచివాలయం ద్వారా ప్రభుత్వానికి సంబంధించిన పలురకాల సేవలు అందించేందుకు 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి నవరత్నాలకు సంబంధించిన పింఛన్ పంపిణీ, చేదోడు, చేయూత, భూముల రీ సర్వే, జనన, మరణ ధృవీకరణ తదితర పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. గత పాలకుల హయాంలో రేషన్‌కార్డ్‌లు కావాలన్న, ఇంటి స్థలాలు కావాలన్న మండల కేంద్రాలకు వెళ్లవలసి వచ్చేది. ప్రస్తుతం తాము ఉన్న గ్రామంలోనే సేవలు పొందుతున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మైలవరం మండలంలో
సచివాలయాల సంఖ్య : 13
4 సంవత్సరాల కాలంలో అన్నిరకాల పథకాల లబ్ధిదారుల సంఖ్య : 30,250
అన్ని రకాల పథకాలకు లబ్ధిదారులు పొందిన లబ్ధి రూ.135.90 కోట్లు
వైఎస్సార్ అసరా తీసుకున్న లబ్ధిదారులు సంఖ్య : 1857
మండలంలో వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య : 6280
మండలంలో పింఛన్‌దారులు పొందిన లబ్ధి రూ.75.36 కోట్లు



మైలవరం మండలకేంద్రంలోని సచివాలయం

పెద్ద కాలువ పరిశీలన



ఆక్రమిత కట్టడాలను తొలగించుకోవాలని ప్రజలకు సూచిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక గోపి విహార్ వీధిలో ఉన్న వర్షపు నీరు పోయే పెద్ద కాలువను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద కాలువలో వర్షపు నీరు పోయేందుకు అడ్డుగా ఉన్న ఆక్రమిత కట్టడాలను ప్రజలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత హోమియో వైద్య శిబిరం

వేంపల్లె : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం ఉదయం ఆర్యవైశ్య ఆఫీసియల్స్ మరియు ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆవోపా అధ్యక్షుడు పుల్లగూర గోవర్ధన్ తెలిపారు. ఈ వైద్యశిబిరానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.శేషఫణిచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. వేంపల్లె చుట్టూ ప్రక్కల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో నాణ్యతగా పూర్తిచేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పాడా కార్యాలయంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందుల మెయిన్ రోడ్డు, సిటీ సెంట్రమ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జితోపాటు ప్లే గ్రౌండ్, మెడికల్ కళాశాల రోడ్డు, వేంపల్లె మెయిన్ రోడ్డు వైండింగ్, యూజీడీ వర్క్స్, పులివెందుల షాపింగ్ కాంప్లెక్స్, గరండాల్ ఫేజ్–2 వర్క్స్, ఉలిమెల్ల లేక్ అభివృద్ధి పనులలో వేగంపెంచాలని అధికారులను ఆయన ఆదేశించారు. అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ఎక్కువ సమయంలేదన్నారు. ఇప్పటికైనా అభివృద్ధి పనులపై దృష్టి సారించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమయం తక్కువగా ఉందని నాణ్యత లేకుండా హడాహుడిగా పనులు చేసినా ప్రయోజనం ఉండదన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్ అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, డీఈ జగదీశ్వరరెడ్డి, ఏడీ శ్రీకాంత్‌రెడ్డి, మోడల్ టౌన్ అధికారులు, ఆయా శాఖల ఏఈలు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో రేపు ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణరాలు డాక్టర్ హరిత సరిగా నిద్ర లేకపోవడం, ముందులాగా పని చేయలేకపోవడం, తలనొప్పి, ఆందోళనగా ఉండటం, టెన్షన్, దడ, చమటలు పట్టడం, భయంగా ఉండటం, ఆలోచనలు అదుపులో లేకపోవడం తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

దోమలను నియంత్రించాలి



నీరు నిల్వ ఉన్న టైర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక భాకరాపురంలో డ్రై డే–ఫ్రైడే సందర్భంగా టైర్ల దుకాణాలను తనిఖీ చేసి టైర్లలో నిల్వ నీటిని పారిశుధ్య సిబ్బందితో తొలగించి దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైర్లలో నీరు నిల్వ ఉంచితే తగిన జరిమానా విధించి టైర్లను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. కార్యకరమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, వార్డు శానిటరీ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



ట్రిపుల్ ఐటీలో మొక్కలు నాటుతున్న డైరెక్టర్ సంధ్యారాణి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తదితరులు

వేంపల్లె : మొక్కలు ప్రగతికి మెట్లు అని.. మొక్కల సంరక్షన అందరి బాధ్యత అని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సంధ్యారాణి, డ్వామా పీడీ యధుభూషణ్‌రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ ఎస్.లక్ష్మీగాయత్రిలు పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లె మండలం ఇడుపులపాయ గ్రామంలోని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మొక్కలకు వారు నీరు పోసి వాటి ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు మనుషులతో సమానమని, అవి మనకు ప్రాణ వాయువును అందిస్తాయని.. జీవకోటికి ప్రాణవాయువు అందించే వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ చలపతి, ఏపీడీ సుబ్బారెడ్డి, ఏపీఓ చంద్రశేఖరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

ముద్దనూరు : మండలపరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెండ్లిమర్రి : చామంతి పూల సాగు చేసే రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చనని ఉద్యానశాఖ హెచ్ఓ సింధూరి అన్నారు.

మండలంలోని నాగాయపల్లె గ్రామ పొలాలల్లోని చామంతి తోటలో శుక్రవారం డాక్టర్ వైఎస్ఆర్ తోటబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం చామంతి పూల మొక్కలు పసుపు రంగులో మారి మొక్కలు చనిపోతున్నాయి. వాటి నివారణకు నెలలో జీవ ఎరువులైన ట్రైకోడెర్మావిరిడి వంటివి మొక్కలు పోయాలన్నారు. అలాగే మొక్కలు నాటేముందు నారును ఏదైనా శిలీంధ్ర నాశినిలో ముంచి నీడలో అరబెట్టి నాటులకోవాలన్నారు. తెగుళ్లను నివారిస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఓ రెడ్డిభాను, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారిపై సాంబారు పడి గాయాలు

కమలాపురం : పట్టణంలోని బీడీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారిపై సాంబారుపడి గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం మధ్యాహ్నం హెల్పర్ రసూల్ బీ చిన్నారులకు అన్నం వడ్డించే ఏర్పాట్లు చేసుకుంటుండగా నిహాంత్ అనే చిన్నారిపై పొరపాటున సాంబారు పడింది. ఈ ఘటనలో నిహాంత్ కాలు, పిర్రలపై గాయాలయ్యాయి. హుటా హుటీన ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం హెల్పర్‌పై నిహాంత్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా హెల్పర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రాజెక్ట్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి వర్కర్ వెళ్లిన సమయంలో తాను ఒక్క దాన్నే ఉండటంతో ఇలా జరిగిందని హెల్పర్ రసూల్ బీ తెలిపారు.

చలో తిరుపతి పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో చలో తిరుపతి పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఈనెల 7వ తేదీన తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్ట్రగుల్ కమిటీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు రూరల్ : వర్షాకాలం వస్తుండటంతో అధికారులు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని మండల ఎంపీపీ గుద్దేటి హరిత సూచించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, కాల్వలను త్వరగా పూర్తిచేయాలన్నారు. అనంతరం సభ్యులు వారి సమస్యలను వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ, ఎంపీటీసీలు, ఎంపీడీఓ రాఘవేంద్రనాథ్, తహసీల్దార్ గురప్ప, మార్కెట్‌యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, విద్యాశాఖాధికారి పరమేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగాల విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు

లింగాల : మండలంలోని పెద్దకుడాల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన భావనకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిందని పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని ఇంటిఓబాయపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణ కుమార్తె భావన పదవ తరగతి ఫలితాలలో 556 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందన్నారు.

ముర్రు పాలు తాపించాలి

కమలాపురం : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రు పాలు తాపించాలని చదిపిరాళ్ల సింగిల్ విండో ప్రెసిడెంట్ మునీంద్రారెడ్డి, సర్పంచ్ నాగరత్నమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని జంగంపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ సిబ్బంది భారతి, ఆంథోనమ్మ, ఏఎన్‌ఎం మంగమ్మ, ఆశా అనిత గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండల పరిధిలోని బిదినంచర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మండల సూపర్‌వైజర్ వసంతకుమారి తల్లిపాలపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌కు జవసత్వాలు

- పారిశ్రామిక విప్లవాన్ని తీసుకువచ్చిన సీఎం జగన్
- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



జాబ్ మేళాకు వచ్చిన యువతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవాన్ని తీసుకువచ్చిన ఘనత, స్కిల్ డెవలప్‌మెంట్‌కు జవసత్వాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే రాకను పురస్కరించుకుని ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటర్వ్యూలకు వచ్చిన యువతీ యువకులతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు మాసాల క్రితమే ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీకి కమలాపురంలో జాబ్ మేళా పెట్టాలని కోరామన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇక్కడ మెగా జాబ్ మేళా పెట్టడం, 13 పెద్ద పెద్ద కంపెనీలు ప్రాతినిధ్యం వహించడం హర్షణీయం అన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎంతో మంది ఫీ రీయింబర్స్‌మెంట్ ద్వారా ఉన్నత చదువులు చదివి ప్రస్తుతం నిరుద్యోగులుగా ఉన్నారని అలాంటి వారికి ఇదొక మంచి అవకాశమన్నారు. వైఎస్సార్ అప్పట్లో కొప్పర్తి లో పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేయాలని 6600 ఎకరాల భూసేకరణ చేశారన్నారు. కానీ ఆయన తర్వాత వచ్చిన నాయకులంతా దాని గురించి పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత కొప్పర్తిలో అనేక పరిశ్రమలు నెలకొల్పారని, డిక్సన్ అనే కంపెనీలో ఇప్పటికే వందల మందికి ఉపాధి కల్పించారన్నారు. అలాగే రాష్ట్రంలో నిరుద్యోగతను నిర్మూలించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు పారిశ్రామిక విప్లవాన్ని తీసుకువచ్చారన్నారు. పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని జీఓ పాస్ చేసి మొదటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కాగా మేళాకు 417 మంది యువతీ యువకులు హాజరు కాగా 209 మందిని 13 కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు, డీఈఓ సురేష్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి నాగార్జున, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

– ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నిడుజివ్వి గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతిఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే చెప్పండి అని ప్రజలకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో కులమత, రాజకీయ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, నిడుజివ్వి గ్రామ సర్పంచ్ అనురాధ, పార్టీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, రాజారెడ్డి, బాబాఫక్రుద్దీన్, మల్లారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రాష్ట్ర అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మైలవరం మండలంలోని తొర్రివేముల గ్రామంలో రూ.40 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు అభివృద్ధిని చూసి ఓర్వలేకున్నాడన్నారు. ఆయన పాలన కాలంలో ఒక్క ప్రాజెక్ట్ అయిన పూర్తి చేశారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, మార్కెట్‌యార్డు చైర్మన్ రమణారెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ శివగుర్విరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.మహేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామాంజనేయయాదవ్, గురప్ప, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురానికి వెళ్లి పింఛన్ అందజేత

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామ వలంటీర్ నాగసుబ్బయ్య అదే గ్రామానికి చెందిన డొక్కు రంగయ్య అనారోగ్య కారణంగా అనంతపురంలోని ఆర్‌డీటీ అసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రంగయ్యకు శుక్రవారం వలంటీర్ అనంతపురం అసుపత్రికి వెళ్లి పింఛన్ డబ్బులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు.

అనంతపురం వెళ్లి పింఛన్ డబ్బులు అందజేస్తున్న వలంటీర్ నాగసుబ్బయ్య



ఈ-క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేసుకోవాలి



వరి పంటను పరిశీలిస్తున్న జేడీఏ నాగేశ్వరరావు

వల్లూరు : ప్రతి రైతు తాను సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోవాలని జేడీఏ అయితా నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని తప్పెట్ల ఆర్‌బీకేలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి మండలస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు గ్రామ స్థాయిలోనే తెలుసుకుని వాటిని మండల, జిల్లా, రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి పరిష్కరించేందుకే సలహా మండలిని ఏర్పాటు చేశారన్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమస్య ఉంటుందని, సమస్యలన్నీ తెలుసుకునేందుకే ఈ మండలి ఏర్పాటైందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరిస్తే వారు వ్యవసాయం సవ్యంగా చేసుకుంటారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అన్నారు. పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోకుంటే ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. అనంతరం వరి పంటను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సాయిజ్యోతి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.